


కథ

-కోపూరి పుష్పాదేవి

క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

"ఇదిగో, ఏమేవ్ విన్నావా, మన మధు ట్రైన్ టిక్కెట్లు కూడా పంపాడు మనం ఎంతకీ రావటం లేదని... "అన్నారు వీరభద్రంగారు.

"ఔను మరి ... ఎన్ని సార్లు రమ్మనమని బ్రతిమిలాడినా మీరు కదలడం లేదాయే. ఏంచేస్తాడు పాపం...? తెలివి గలవాడు, ఇంక ఎలా రారో చూస్తాను అన్నట్లు, ఏకంగా టిక్కెట్లే పంపాడు...." అన్నది రత్నావతి భర్త చేతికి బి.పి. టాబ్లెట్లు, మంచినీళ్ళు అందిస్తూ.

వీరభద్రం గారు కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా యూనివర్శిటీలో పనిచేసి రిటైరయ్యారు. మధు ఆయనకు పూర్వ విద్యార్థి. మాస్టారూ, మీ చలువ వల్లనే నాకు ఈ చదువు అబ్బింది. మీ దయ వల్ల మంచి ఉద్యోగం కూడా వచ్చింది. తల్లి దండ్రులు లేని నాకు ఎందుకనో, మీ భార్యా భర్తలే అమ్మానాన్నలుగా అనిపిస్తున్నారు. మీరు ఎలాగూ రిటైర్ అయ్యి, విశ్రాంతి తీసుకుంటున్నారు. కనుక మా ఇంటికి వచ్చి, నాలుగు రోజులుండి, మా ఇంటినీ, మమ్మల్ని పావనం చెయ్యాలని ప్రార్థి స్తున్నాము నేనూ, నా భార్యా కూడా అని, రెండు మూడు ఉత్తరాలు రాశాడు. వీరభద్రంగారికి ఆ మధు ఎవరో, ఏ సంవత్సరంలో చదివాడో ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. అందుకని మెదలకుండా ఊరుకున్నాడు. ఈయన ఊరుకున్నా, అతను ఊరుకోలేదు. ఎలా సంపాదించాడో మరి ఫోన్ నెంబరు, ఫోన్లు చెయ్యడం మొదలుపెట్టాడు. ఇప్పుడు వాళ్ళ ఊరు విజయవాడకు రమ్మని, ఏకంగా రెండు టిక్కెట్లు పంపాడు. "కనకదుర్గమ్మను దర్శనం చేయిస్తాను, పానకాలస్వామి దగ్గరకు తీసుకువెళతాను, ఇంకా మీకు అభిలాష వుంటే చుట్టుపక్కల పుణ్యక్షేత్రాలన్నీ, మీకు శ్రమ, అలసట లేకుండా నా కారులో తిప్పుతాను... " అని పసివాళ్ళకు బెల్లం ఆశ చూపినట్లు చెప్పాడు. మీరు ట్రైన్ దిగేసరికి, నేను గుమ్మంలో వుంటాను. నన్ను గుర్తు పట్టగలరో, లేదోనని మీకు బెంగ అక్కర్లేదు. నేనే మిమ్మల్ని గుర్తుపట్టి పికప్ చేసుకుంటాను అని గట్టి భరోసా యిచ్చాడు. వీరభద్రం దంపతులకు ఇక తప్పలేదు.

రాత్రికి బండెక్కి, హాయిగా స్లీపింగ్ బెర్తుల్లో పవ్వళించి, ఉదయం బండి దిగారు. కంపార్ట్‌మెంట్ దగ్గరకు వీళ్ళ కోసం ఎవరూ రాలేదు. చూసి, చూసి మెల్లగా లగేజ్ మోసుకుంటూ ట్రైన్ దిగి, ప్లాట్‌ఫాం మీద సెటిలయ్యారు. లగేజ్ దగ్గర పెట్టుకొని, జాగ్రత్తగా చూసుకుంటూ, ఈ అబ్బాయికి ఏమయ్యింది... ? కచ్చితంగా వస్తానన్నాడు... ఆరోగ్యమేమైనా బాగుండలేదా ఏమిటి....? అనుకుంటూ

"అవునండీ మీ దగ్గర అతని ఫోన్ నెంబర్ ఉన్నది కదా..., ఫోన్ చేస్తే విషయం తెలిసిపోతుంది కదా...?"అన్నది రత్నావళి.

"నిజమేనేవ్.... ఏమిటో నా బుర్రకు తోచలేదు. అదిగో అవతల కాయిన్‌ఫోన్ వున్నది. చేసి వస్తాను. సెల్ తేవటం మర్చిపోయాను కదా! సామాను జాగ్రత్త..." అంటూ వెళ్ళారు. ఫోన్ రింగవుతోందిగానీ,

ఎవరూ ఎత్తడం లేదు. "ఈ నెంబరేనే అతనిచ్చింది. ఏమయ్యుంటుందీ...? వస్తానన్న వాడు, అతనూ రాలేదు... ఫోనూ ఎత్తడంలేదు... ఏమిటబ్బా..?" అంటూ కొద్దిసేపు ఆలోచించి, ఏమీ తట్టక, వచ్చి భార్యకు చెప్పాడు. "అయ్యో... అలాగా... మరిప్పుడు ఏమిటి చెయ్యడం...". ఆమె కంగారు పడింది. మరో రెండుసార్లు ఫోన్ చేసినా. అదే పరిస్థితి.

"అంత కంగారు ఎందుకే..., అతని అడ్రస్సు మన దగ్గర ఉన్నది గదా, ఆటో వేసుకుని మనమే వెళ్దాం..." అన్నాడు ఆయన.

ఈఫోన్ నెంబరు లాగ, ఆ అడ్రసులో అతను లేకపోతే...? అసలే మనకు ఊరు కొత్త. ఈ ఊళ్ళో బంధువులు కూడా ఎవరూ లేరు అన్నది మరింత గాభరాగా.

"ఎందుకే అంత దిగులు పడతావు పిచ్చిదానిలా. నోట్లో నాలుకా, జేబులో డబ్బులూ వుంటే ఎక్కడికయినా వెళ్ళొచ్చు. తెలివి తక్కువ వాళ్ళమా ఏమిటి... ఏమీ భయంలేదు. లే, లేచి సామాన్లు పట్టుకో. అలా బయటకు వెళ్ళి ఆటో ఎక్కుదాం...." అన్నారు వీరభద్రం ఒక బ్యాగు చేతిలోకి తీసుకుంటూ.

"అయ్యో... ఇక్కడ నా బ్యాగు ఏదండీ... ఇక్కడే పెట్టానుగా... కనపడటంలేదు".

"అక్కడే వుంటుంది, సరిగ్గా చూడు.."

"అయ్యో... లేదండీ బాబూ... ఎవడో కొట్టేశాడు". "అయ్యో, అయ్యో" అంటూ ఆమె ఘొల్లుమన్నది.

"గొప్ప పనిచేశావ్. లగేజ్ జాగ్రత్తగా చూస్తుండమని చెప్పేవెళ్ళాను గదా... కాస్సేపు కూడా చూడలేకపోయావు..." ఆయన గయ్యి మన్నాడు.

"అయ్యో, మీరు వచ్చినప్పుడు కూడా వున్నదండీ. మీరు వచ్చాకే, మనం మాటల్లో ఉన్నప్పుడు, ఎవడో దొంగవెధవ కాజేసి వుంటాడు. వాడి చేతులిరగ.. వాడి కళ్ళుపోను.."

"చాల్లే అరుపులు. నోరుముయ్యి... ఇంక ఆ బ్యాగ్ మీద ఆశలు వదులుకుని బయటికి తగలడు. ఆ మధుగాడి కొంపేదే, ఎక్కడుందో కనుక్కుని వెళ్ళాలి.." రుసరుస లాడుతూ ఆయనా, వెనుకే ఉసూరుమంటూ ఆవిడా కదిలారు.

తిరగ్గా తిరగ్గా ఇల్లు దొరికింది. నాలుగో అంతస్థు. లిఫ్టు లేదు. బారీ కాయులిద్దరూ, అష్టకష్టాలూ పడి, అపార్టుమెంటు చేరు కున్నారు. బయట నేమ్‌బోర్డు కనపడింది. "హమ్మయ్య" అనుకుని బజర్ నొక్కారు.

మధు తలుపుతీశాడు. "అయ్యో మీరా మాస్టారు... నేనిప్పుడే స్టేషన్‌కు బయల్దేరు తున్నా మీకోసం. ఈవేళ ట్రైను ముందే వచ్చేసిందా ఏమిటి ...?"

"ట్రైన్ ముందుగా రావటం ఏమిటి నాయనా...., నీకే ఆలస్యమైనట్లుంది. అతను కూర్చోమనక ముందే కుర్చీలో కూలబడ్డారు ఇద్దరూ ఆయాస పడుతూ. మధు భార్య చిత్ర చల్లని మంచినీరు తెచ్చియిచ్చింది. ఆ నీళ్ళు తాగి కొద్దిగా తేరుకున్నారు. "నమస్కారం" అంటూ ఇంట్లో వున్న అందరూ విష్ చేశారు వీళ్ళకు. అందర్నీ పరిచయం చేసి, సారీ మాస్టారు, ట్రైన్ టైమ్ విషయంలో నేనే పొరపాటు పడ్డాననుకుంటాను. పోనీ లెండి క్షేమంగా వచ్చారు. అంతే చాలు.... " అన్నాడు తనూ వారి ఎదురుగా కొద్దిగా కాలు విరిగిన స్టూలు మీద జాగ్రత్తగా కూర్చుంటూ.

"ఏమి క్షేమంలే నాయనా... నిక్షేపం లాంటి బ్యాగు పోయేనూ, అన్నీ క్రొత్త చీరలే! ముదనష్టపు చచ్చినోడు వాడి ఎదాన కొట్టు కున్నాడు..." అన్నది రత్నావతి పమిటి కొంగుతో విసురుకుంటూ.

అది మూడు చిన్న చిన్న గదుల పోర్షన్. అందులోనే తల్లి, తండ్రి, తమ్ముడు, చెల్లెలు, ఇద్దరు పిల్లలతో సహా కాపురముంటున్నాడు మధు. ఆ ఇల్లు చూస్తే వాళ్ళ ఆర్థిక పరిస్థితి పూర్తిగా అర్థమవుతుంది. " ఏమిటి మధు పెద్ద ఉద్యోగమన్నాడు... సొంత కారు అన్నాడు...., కనీసం ఫోను కూడా లేదు. ఇన్ని అబద్ధాలు చెప్పి మమ్మల్ని ఇంత పట్టుదలగా ఇక్కడకు రప్పించడంలో అతని ఉద్దేశ్యమేమిటి...?" వీరభద్రంగారి చురుకైన బుర్రకు కూడా సమాధానం తోచలేదు.

## చినుకు

మట్టి హృదయంలో
చినుకు అడుగులు
పచ్చదనం ఎగిసిపడుతోంది
తరంగాల్లా
గాలిగుండెల్లో
ఆనంద మయూరాలు
చినుకు ఆకుమడికి శ్వాస
చిగురుకు ప్రాణం
మనిషికి ఆనందం
ఆకాశం అమ్మ చినుకు బిడ్డను
మట్టికి అందిస్తోంది మౌనంగా
చినుకు భాష
మట్టికే తెలుసు
మట్టి మౌన పగుళ్ళ బాధ
చినుకు హృదయ గాథ
చినుకులా కురవాలి నిండుగా
చెట్టులా బ్రతకాలి ఇతరుల కోసం
చిగురును మోయాలి మట్టి
బిడ్డలా
ఇవ్వాళ చినుకు కోసం
రైతుగుండె గిలగిల కొట్టుకొంటోంది
మట్టి మౌన నిరీక్షణ
బజారున పడుతున్న రైతు జీవితం
ఎండిన మట్టి గుండె మీద
ఆకలి పక్షి విషాదగీతం పాడుతోంది
చినుకు జాడకోసం కొత్త చూపు
రైతుల కళ్ళు
ఓట్ల కోసం రాజకీయ చూపు
బాధ ఒకరికి
ఆనందం మరొకరికి
చినుకు రాలకపోయిన
మధ్యం ప్రవహిస్తోంది ఎన్నికల
పొలాల్లో
ఓడిన అధికారం నివేదికల కోసం
నిరీక్షణలు
ఆకలి రైతు చినుకు కోసం
చిగురుపాటు కోసం
గుడిసెల్లోంచి ఆకాశం వైపు చూపు

-నల్లా నరసింహమూర్తి

"అయ్యో, ఈ పాడు కరెంటు కూడా ఇప్పుడే పోవాలా..,బ్యాగు పోవడమేమిటి పిన్ని గారూ.." అడిగింది చిత్ర తానూ అక్కడే నేల మీద కూర్చుని కూతురుకు జడలు వేయబోతూ.

"నేనూ, మీ బాబాయిగారూ మీ అడ్రసు దొరుకుతుందో లేదోనని మాట్లాడు కుంటూ వుంటే, ఎవడో దొంగవెధవ నా బ్యాగు కొట్టే శాడు. ఇప్పుడు నా గతేమిటి?... స్నానం చేసి ఏమి కట్టుకోను...?" ఆవిడకు కన్నీళ్ళు ఒక్కటే తక్కువగా వున్నది.

"అత్తయ్యగారి చీర జాకెట్టు ఇస్తాను గాని, గాభరా పడకండి పిన్నిగారూ"ఓదార్చింది చిత్ర.

"ఆమేమో సన్నగా, పుల్లలా వున్నారు. ఆమె బట్టలు నాకెక్కడ సరిపోతాయి...?"

"ఎలాగోలా రెండు రోజులు ఎడ్జస్టు చేసుకోలేవా...? అయినా అన్ని చీరలు వద్దంటే విన్నావు గాదు. రెండ్రోజులు కోసం ఏడెనిమిది చీరలు పెట్టి బ్యాగు నింపావు. పట్టుకెళ్ళినవాడి పంట పండింది. ఇప్పుడు ఏడ్చి తగలడు..." ఆయనకు మళ్ళీ బుస్సున కోపం వచ్చింది.

"పోనీలెండి. అయిపోయిందేదో అయి పోయింది. నేను బజారు నుండి రెండు కొత్తచీరలు తెస్తాను. చిత్రా వీళ్ళకు టిఫిన్ పెట్టవా ఏమిటి?.... మాటలతో కడుపు నింపు తున్నావు... " అన్నాడు మధు.

"అయ్యో! మర్చేపోయానండి మాటల్లో పడి. దోసెలు పోశాను. మళ్ళీ వచ్చాక పోస్తూ కూర్చుంటే, ఆలస్య మవుతుందని ముందే పోసి రెడీ చేశాను. ముందు స్నానం చేస్తారా..." అడిగింది చిత్ర.

"హమ్మయ్య...టిఫిన్ పెట్టాలని ఇప్పటి కైనా వీళ్ళకి గుర్తుకు వచ్చింది..." అనుకున్నారు ఇద్దరూ. పెద్ద ప్రాణాలు కదా ఆకలికి ఆగలేరు. స్నానాలు తరువాత చేస్తామన్నారు.

చిన్న చిన్నవి రెండేసి అట్లు, చాలా కొద్దిగా చట్నీ వేసి పట్టుకొచ్చి ఇద్దరికీ యిచ్చింది చిత్ర. అవి ఫ్రిజ్‌లోంచి తీసినట్లు, చల్లగా బిగుసుకుని వున్నాయి. పచ్చడి ఎప్పుడు చేసిందో ఏమో. మాగుడు వాసన వేస్తోంది.

క్రొత్త చోటు. ఆ అమ్మాయిని ఏమీ అన లేక, అవే మహాప్రసాదం అన్నట్లు తిన్నారు ఇద్దరూ. మూడవది వేస్తానని మాటవరసకు కూడా అనలేదు చిత్ర. తరువాత, చల్లారిన నీళ్ళ కాఫీ.

"అనకూడదు గాని, మా చిత్రకు బంధువు లంటే వల్లమాలిన అభిమానం. మీకు ఏమీ లోటు చేయదు. హాయిగా ఓ పదిరోజు లుండి వెళ్ళండి...నాకు ఆఫీసుకు టైమయ్యింది. నేను వెళ్తున్నాను..." అంటూ మధు హడా విడిగా వెళ్ళి పోయాడు. భార్యా భర్తలిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు.

ఒక గంటకు "స్నానాలు యిప్పుడు చేస్తారా..." అని అడిగింది చిత్ర వంట చేస్తూనే.

చేస్తామన్నారు వీళ్ళిద్దరూ. ఏమీ అను కోకండి గ్యాస్ అయిపోవచ్చింది. చన్నీళ్ళే చెయ్యాలి.... చావు కబురు చల్లగా చెప్పింది.

మండు వేసవిలో కూడా గోరువెచ్చటి నీళ్ళు స్నానం చేసే అలవాటు వున్న వీళ్ళిద్దరూ ఆ చలికాలంలో కిమ్మనకుండా ఏదో రెండు చెంబులతో స్నానమైందని పించారు.

"కట్టుకోండి పిన్నిగారూ..." అంటూ తన అత్తగారి చీర, జాకెట్టు యిచ్చింది చిత్ర. అలవాటు లేనివీ, ఇరుకైనవీ బట్టలు కట్టుకున్న రత్నావతి అవస్థ వర్ణనాతీతం.

మధు ఒక కిరాణా షాపులో గుమాస్తా. తల్లికి కీళ్ళ నొప్పులు. తండ్రి గుండెజబ్బు మనిషి. పెళ్ళి కెదిగిన చెల్లెలు. నిరుద్యోగి తమ్ముడు. ఇవన్నీ సినిమా కష్టాలుకాదు. నిజంగా నిజమే.

క్రొత్త చీరెలు తెస్తానన్న మధు, ఆ మాట మర్చిపోయినట్లు, రాత్రి పదిగంటలకు నీరసంగా సైకిల్ త్రొక్కుకుంటూ వచ్చాడు.

☆ ☆ ☆

వీరభద్రం, రత్నావతి దంపతులకు ఆస్తిపాస్తులైతే బాగానే వున్నాయి కాని, పిల్లలు లేరు. భార్యా భర్తలిద్దరూ పీనాసి తనంలో పోటీపడినట్లుంటారు. అందుకేనేమో "శ్రేయోభిలాషులందరూ ఒక మంచి పిల్లాడిని చూచి దత్తత చేసుకోండి. తమ వయసు మీద పడ్డ కాలానికి మీకు అక్కర కొస్తాడు..."అని చెప్పిన హితవు వీళ్ళకు రుచించలేదు. ధర్మకార్యాలకైనా ఒక రూపాయి వెచ్చించడంకన్నా, ఆ రూపాయికి మరో రూపాయి జతచేసి దాచడంలోనే వారికి ఆనందం ఎక్కువ. ఇద్దరూ ఒకేరకపు మనస్తత్వం కలవాళ్ళవటంతో చీకు-, చింతా లేక వారి పిసినిగొట్టు అభిరుచిని దినదినాభివృద్ధి చేసుకోగలిగారు. వీరభద్రం గారికి యూని వర్శిటీ వారిచ్చే జీతంకన్నా, ట్యూషన్ల మీద ఎన్నో రెట్లు ఎక్కువ ఆదాయం వచ్చేది. క్లాసులో పాఠాలు అర్థమయ్యేటట్లు చెపితే ట్యూషన్లకు ఎవరూ రారని, క్లాసులో అసలు చెప్పేవాడు కాదు. ఎవరైనా బీద విద్యార్థులు అర్థంకానివి చెప్పమని బ్రతిమలాడినా, ఆయన కనికరించే వాడు కాదు. అలా, ఆయన దయవలన చదువు పూర్తిచేసుకోలేకపోయిన బీద విద్యార్థుల్లో మధు ఒకడు.

ప్రతికూల పరిస్థితుల్లో అష్టకష్టాలు పడి డిగ్రీ పూర్తిచేసిన మధు, తినో, తినకో ఎలాగోలా కష్టపడి పి.జి. చేస్తే మంచి ఉద్యోగం వస్తుంది. తనకూ, కుటుంబానికి కూడా మంచి రోజులు వస్తాయని ఎంతో ఆశ పడ్డాడు. ట్యూషన్లో చేరని కారణంగా వీరభద్రం మధు మార్కులు కోసే శాడు. ఫలితంగా ప్రీవియస్‌లో ఫెయిల్. అప్పుడు తండ్రి ఆరోగ్యం మరింత క్షీణించడంతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టక తప్పలేదు అతనికి. డిగ్రీ చదువుకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే రోజులా యివి...?ఫలితంగా గుమస్తాగిరి.


కొన్ని ఆశలు చంపుకున్నా, అన్ని ఆశలు అణచివేయలేరు కనుక, పెళ్ళి, పిల్లలు తప్పలేదు మధుకి. కాలం గడిచే కొద్ది పరిస్థితులు మరింత క్షీణించాయి. తండ్రితో పాటు, తల్లి కూడా మూలన పడటం గుండెల మీద కుంపటిలా పెళ్ళి కెదిగిన చెల్లెలు, నిరుద్యోగ భూతంతో పోరాడి అలసిపోతున్న తమ్ముడు.

అప్పుడప్పుడూ తన ఈ హీనస్థితికి కారణమైన వీరభద్రంపై అతనికి వల్లమాలిన క్రోధం తన్నుకు వచ్చేది. ఆ క్రోధం, ఆవేశం ఎలా తీర్చుకోగలడు...? ఎంత ఆలోచించినా అతనికి ఏ ఉపాయం తోచలేదు. ఆఖరుకు ఆయనను తీసుకువచ్చి, తన పరిస్థితులను కళ్ళారా చూపించి, "దీనికి మీ సమాధానం ఏమిటి...?" అని నిగ్గదీసి అడగాలనుకున్నాడు.

వీరభద్రం అతి తెలివైన వాడవడంతో మధు అడగకుండానే అతని మనస్సు పసి

గట్టాడు. అతనిలో అంతర్మధనం ప్రారంభమైంది. ప్రపంచంలో జరిగిన ఎనిమిదో వింతలాగ కరడు గట్టిన బందిపోటు దొంగ వాల్మీకి మహర్షి అయినట్లు, "నిజమే మధు తెలివిగలవాడు. ఎం.ఎస్.సి. పూర్తిచేసి వుంటే కచ్చితంగా ఏదో ఒక మంచిఉద్యోగం వచ్చేది. ఇంతకన్నా తెలివి తక్కువవాళ్ళు చాలా మంది, ఆర్థిక వనరుల అండతో పెద్ద పెద్ద చదువులు చదివి గొప్ప ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళను తాను చాలా మందిని చూశాడు. మధుకు కూడా మంచి ఉద్యోగం వుంటే తల్లీ, తండ్రి, భార్య, పిల్లలు అందరూ మరీ గొప్పగా కాకపోయినా, ఇంత హీనస్థితిలో మాత్రం వుండేవాళ్ళు కాదు. వారి ఈ లేమికి తన అజ్ఞానమో, మూర్ఖత్వమో కారణం కాబట్టి తనే వారిని ఆదుకోవాలి..." అని నిర్ణయించు కున్నాడు.

మరునాడు ఉదయం ఆ అపార్టుమెంట్ల సముదాయంలోని 50 కుటుంబాల వారిని సమావేశపరిచాడు వీరభద్రం. జరిగిన సంగతి అంతా క్లుప్తంగా వివరించాడు. అందరిముందు తన ఆలోచనలను పరిచాడు. తప్పు చేసినందుకు బాధ పడుతున్నానేగాని, ఆ తప్పు ఒప్పుకోవడానికి సిగ్గుపడటంలేదు. నా పాపానికి మధు లాగానే ఎందరెందరో బలి అయ్యి వుంటారు. వారందరికి నా క్షమార్పణలు. ఇప్పుడు పాపపరిహారార్థం, మధు చెల్లెలి పెళ్ళికి, అతని తల్లిదండ్రుల వైద్యానికి ఖర్చులు నేను భరిస్తాను. అంతే కాదు, నేను పెట్టుబడి పెట్టి మధు, అతని తమ్ముడు చేత బిజినెస్ ప్రారంభింపచేస్తాను. ఇలా, గవర్నమెంటువారు కొన్ని వెనుకబడిన గ్రామాలను దత్తత చేసుకొని వారి అభివృద్ధికి కృషి చేసినట్లుగా నేను ఈ కుటుంబాన్ని దత్తత చేసుకుంటాను. ఇంతే కాదు, నాలా రిటైర్ అయిన నా తోటి అధ్యాపకులందర్నీ ఒప్పించి, బీద విద్యార్థుల కోసం ఉచిత ట్యూషన్ పాయింట్ ఒకటి ప్రారంభిస్తాను. మధు మమ్మల్ని ఇలా పిలిచి వుండకపోతే చదువుకున్న మూర్ఖుడిలాగా నా చదువునూ, సంపాదననూ కూడా అడివిగాచిన వెన్నెలలా నిరుపయోగం చేసేవాడిని. ఈ విధంగా నా కనులు తెరిపించి, నేను మంచి పనులు చేయడానికి కారణభూతుడైన ఈ మధుకు ఎంతో ఎంతో కృతజ్ఞుడిని. ఇది మధుకి నేనందించే శిష్య దక్షిణ..." అంటూ ఆయన చెమరించిన కళ్ళు ఒత్తుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు. వెంటనే చప్పట్లతో హాలు మారుమ్రోగింది. మధు, చిత్ర వీరభద్రం పాదాలకు నమస్కరించారు.




## అవరోహణ

ఆనాడు
యక్షుణ్ణి సమాధానపరచిన
యుధిష్ఠరుడు ఇపుడు
సందేహాల ట్రాఫిక్ చక్రవ్యూహంలో
కాలుష్యానికి బలైపోతున్నాడు,
కాలుష్యమంటే
రోడ్డు మీది ధూళి –
ధూమకెరటాలేనా ?
అనేకానేక
మలిన అంతరంగాల్ని
జోకొడుతున్న అవసరాల
చాకచక్యం,
భయంకరంగా
రాజీపడుతున్న వర్తమానం !
గత కీర్తి కిరీటాల
కాంతిలో ఊరేగుతూ
జనరంజకమైన ప్రవచనాలతో
చప్పట్ల హోరులో ఖ్యాతి
విలువల పతనంతో
మరో మెట్టు ఎక్కుతున్నది,
ఇప్పుడు ఇక్కడ
అధిరోహణ అంటే
మానప్రాణాల అవరోహణమే !!

-నిఖిల్

## బాల సాహిత్యానికి స్వాగతం



అంటే
బాలల కోసం సాహిత్యం
బాలలు రాసిన సాహిత్యం
కథ, కవిత, పాట, వ్యాసం
ఏ సాహిత్య రూపమైనా సరే..